# అస్పృశ్యుడు




శ్రీ కంచిభట్ల కృష్ణమూర్తి

"కాదు" అన్నాడు ఒకవిధమైన బింకంతో రావు.

"ఏమండి?"

జానకిరావు గవిరెన్నకేసి చూసి ఒక్క క్షణం ఆగి "గవిరెన్నా, ఇలావచ్చికూర్చో దగ్గరగా" అన్నాడు. గవిరెన్న ఏమా అని అతని దగ్గరికి వచ్చి కూర్చున్నాడు. అక్కడ వాళ్లిద్దరే ఉన్నారు. ఇప్పుడే తన సంగతి అంతా అతనికి విప్పి చెప్పాలని నిశ్చయించుకున్నాడు జానకిరావు. ఎలాగయినా అతనికి చెప్పకతప్పదు. అందులో తన హృదయంలో బరువు కొంత తగ్గించుకోవలని ఉంది. తన సంగతి సరిగా తెలుసుకున్నాక గవిరెన్న తనకి సహాయంగా ఉంటా డనుకున్నాడు. జానకిరావు మొదలు పెట్టాడు.

"గవిరెన్నా, నీతోటి మనస్సువిప్పి మాట్లాడుతున్నాను. మా అన్నయ్యకి నామీద కోపం వచ్చింది. నేను తెగ ఖర్చుపెట్టేస్తున్నానని నన్ను పట్టిపోస్తున్నాడు. అందుచేత నాకు యింక అక్కడ ఉండడం యిష్టంలేకపోయింది. ఈ పొలంలో నావాటాఉంది కదా, యిక్కడ దున్నుకునేనా బ్రతుకుదాం అనివచ్చేను. ఇక్కడికి వచ్చేవరకు నాకు పొలంసేద్యం అంటే ఎలాఉంటుందో



తెలియదు. ఇప్పుడది కష్టం అనిపించినా, నేనెక్కడికి వెళ్ళతాననుకున్నావు? మా అన్నయ్య ఇంటి దగ్గరనుంచి నన్ను వెళ్లిపొమ్మన్నాడు."

"కొంచం డబ్బు కర్చుపెట్టేస్తేనే ఎల్లి పొమ్మంటారాండీ?" అని గవిరెన్న ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

"దానికి ఇంకా కారణంవుందిలే. నేనూ, ఒక రిటైర్డు మేజస్ట్రేటుగారి కూతురు కలిసి చదువుకున్నాం. మేం ఇద్దరం పెళ్లిచేసుకోవాలనుకున్నాం. మేం వైదీకులం, వాళ్ళు నియోగులు. అందుచే మా అన్నయ్య, మా అమ్మ దానికి ఒప్పుకోలేదు."

"మరి ఎలాగండి? వైదీకులు, నియోగులు పెళ్లాడడం తప్పుకాదండీ?" అని నెమ్మదిగా అడిగాడు గవిరన్న.

"తప్పని ఎవరన్నారు? ఈ రోజుల్లో ఒక కులంవాళ్ళు ఇంకొక కులంవాళ్ళని పెళ్ళాడవచ్చు. నాకు ఇష్టంగా పెళ్ళాడాలనివుంటే ఒక హరిజన బాలిక—అంటే మాలపిల్లనికూడా పెళ్ళాడెయ్యొచ్చు. తెలుసా?" అని ఆవేశంతో అన్నాడు రావు.

"అవునటండి. ఈ మద్దెల రాజమందిరం ఎళ్ళితే 'మాలపిల్ల' అనే సినిమాకి తీసికెళ్లేరండి

మావాళ్లు. అందులోకూడా మీరు చెప్పినట్లే ఉందండి'' అని తలవూపాడు గవిరెన్న.

''ఆఁ గాంధీ అంటే ఎవరో తెలుసా నీకు?''

''ఎరక్క పోవడమేటండి, శ్రీరాముడే ఆయన జన్మం ఎత్తేడుట కాదండి?'' అని భక్తిగౌరవాలు అభినయించాడు.

''ఎవరు చెప్పేరు?''

''ఇక్కడందరు అల్లాగే చెప్పుకుంటారు. మొన్న ఇక్కడ అందరం కలిసి గాంధీ భజనచేసేమండి'' అంటూ కిందటివారం జరిగిన భజనవివరాలు తెలియజేశాడు.

''గాంధీగారు అసలు ఎవరో తెలుసా? ఆయనేంపనిచేస్తాడో?'' అని రావు ప్రశ్నించాడు.

మొన్నేకదండీ గాంధీగారు, యీ సిరాయిగారు మాట్లాడుకున్నారుట. మా రైతులందరికీ వెంటనే కడుపునిండా తిండి ఉండేలాచెయ్యాలన్నాన్నాడుట ఆయన. ఆ యీసిరాయిట యినలేదట; అంచేత వెంటనే గాంధీగారు మాకు స్వరాజ్యం ఇచ్చెయ్యమంటుక మళ్ళించటం కనిగిరేసు ఎరుగుదురా?'' అంటూ గవిరెన్న తనకు తెలిసిన రాజకీయాలు యేకరువుపెట్టాడు.

''కనిగిరేసా? అంటే?'' అని అర్థంకాక జానకిరావు గవిరెన్నవేపుచూచాడు.

''చదువుకున్నోరు, కనిగిరేసే ఎరగరటండీ? మినిష్టరీలు చేసేరు మనోళ్ళు...''

''ఓరి, కాంగ్రెసు మినిస్టరీలా?''

''ఆ మీకు తెలియదేమో. అరంతా మన కోసమే కాదండీ?''

''అవును, ఇదంతా ఇంకా మీకు పూర్తిగా తెలియదు. నేనంతా మీకు చెప్పుతాను. నేనెల్లాగో ఇక్కడే ఉంటానుకదా. ఈ ఊళ్ళోవాళ్ళందర్నీ ప్రోగుచేసి అన్నిసంగతులు చెప్పతూంటాను. నేనుమాత్రం పొలం వ్యవసాయంమాని, ఈ ఊరు వదలిపెట్టి వెళ్ళిపోనులే.'' అంటూ తన నిశ్చయాని తన పునికినీ అంతా జానకిరావు చెప్పివేశాడు.

''భయంలేదండి నాలుగురోజులు తంటాలు పడితే పొలంపనులు మీరేచేయగలరు. పైగా నేను కూడా ఉన్నాను కాదండీ? ఇందాకేటి అన్నారు? ఆపిల్లని పెళ్ళాడతానన్నారా?'' అంటూ అభయహస్తమించి రావు పెళ్ళిప్రశంసతెచ్చాడు.

''మా అన్నయ్య పెళ్ళాడద్దన్నాడు. నేను పెట్టాడక మాననన్నాను. తనమాట వినకపోతే వెంటనే ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నాడు. ఇలా వచ్చేసేను.'' మళ్ళీ రావు తన సంగతిచెప్పాడు

''పాపం, ఎంత కర్మం అండి, చిన్నతనంలోనే ఇంతగతి ఏమండి? అయినా రామచంద్రంగారు అంత చెడ్డవారు కాదేండి? అంటూ గవిరెన్న యోచనచేశాడు.

''ఆయన కోపిష్టి. నేనంటే ఏమిటో తెగ కోపం. నన్ను ఎప్పుడూ తిడుతూనే ఉంటాడు. క్రిందటి ఏడు నువ్వు వచ్చినప్పుడు చూసేవు కాదూ? నువ్వు అడ్డుకోబోతే నిన్నుకూడా తిట్టడం మొదలెట్టేడు. అందులో ఈ పెళ్ళి అంటే అతనికి బొత్తిగా కిట్టలేదు'' అన్నాడు రావు.

''మీరేం బెంగపెట్టుకోకండి బాబూ, మీకేమీ లోటుఉండదు ఇక్కడ. నేను మిమ్మల్ని చూస్తాను'' అన్నాడు గవిరెన్న.

జానకిరావుకు కొంచం ధైర్యం వచ్చింది. ''నీ మంచి ఎరిగిఉండే నీ దగ్గరికి వచ్చేను. ప్రస్తుతం నువ్వే నాకు సహాయం. నువ్వు నా తండ్రి వంటి వాడవనుకుంటాను. ఈ ఊళ్ళో మీ అందరి సహాయం పొంది గోళ్ళుగిల్లుకుంటూ ఊరికే కూర్చుంటాననుకున్నావా? అటు పొలంపనులు చేసుకుంటూంటాను. ఇటు మీ అందరికీ క్రొత్త క్రొత్త వింతలన్నీ చెప్పుతూ ఉంటాను. నేను ఈ ఏడాది అంతా మీకోసమే పనిచేస్తాను. చూస్తూ ఉండండి. మీఊరు ఎంతగొప్పగా చేస్తానో, గాంధీగారు ఆయన ఊరువదలిపెట్టి మనఊరు వచ్చేసేలా చేస్తాను చూడండి'' అంటూ యౌవనోత్సాహాన్నంతనీ బయట పెట్టాడు.

## 11

గోడకి తగిలించిఉన్న జానకిరావు ఫొటోని తదేకదృష్టితో చూస్తూ నిలబడిపోయింది సరోజిని. ఆమెదృష్టి మాత్రం నిజంగా ఆపటంమీదలేదు. ఆపటంబుంచా యిప్పుడు జానకిరావు ఎక్కడ ఉన్నాడో, పొలాల్లో ఏమికష్టపడుతున్నాడో, తిండి ఎలా దొరుకుతుందో చూస్తూంది. పెళ్ళిపోయేముందు అతడు తనకు కనబడినప్పుడు తాను విభ్రాంతపోయి ఏమేమో మాట్లాడింది, కాని అతనితో మనస్సువిప్పి మాట్లాడలేదు. అతడు ఏమేనా డబ్బుతీసుకువెళుతున్నాడో లేదోకూడా అడగలేదు. ఏమీ సహాయం చేయలేదు. అతనిని తన ఇంటి వద్ద ఆపడానికి తనకు శక్తిలేదనేతోచింది అతనింలో ఏమిచేయడానికీ ఆమెకు తోచలేదు. తనని జానకిరావు ఏవిధంగా అర్థం చేసుకున్నాడో కూడా తెలియదు. నిర్దయి, ప్రేమ లేనిది అనుకున్నాదేమో! ఎప్పటికేనా అతనిని తిరిగి కలుసుకుంటాడోలేదో! తల్లి మాటచొప్పున అతడు తనను పెళ్ళాడకూడదని చెప్పింది. తాను త్యాగం చేయడానికి సిద్ధంగాఉన్నది. కాని అతనిపై తనకుగల ప్రేమ ఎక్కడికిపోతుంది? ఆమె ఇంటర్మీడియటు చదువుతూంది. అందరు చదువుకున్న పిల్లలవలెనే గొప్పవేషాలు ఉన్నాయి. స్నోలు, పౌడర్లు, లిప్ స్టిక్‌లు, స్లిప్పర్లు, కోట్లు....షీటికి లోటులేదు. అయినప్పటికీ సరోజిని తోడివారిని మించింది, ప్రేమలో.

'జానకిరావు మళ్ళీ కనబడతాడా, అతడు కనబడితే చేయవలసినపని ఏమిటి' అని ఆమె ఆలోచిస్తూనిలబడ్డది. పోనీ ఒక ఉత్తరమేనా వ్రాద్దామంటే అతడెక్కడికి వెళ్ళేదో తెలియదు! అతని అన్నగారికి తెలిసిఉంటుందేమో. కాని అసలే తన మీద కోపంగా ఉన్నప్పుడు వారియింటి కబురు పంపించడానికి భయం.

శంకరయ్య తొంగిచూస్తూ గదిలోకి వచ్చేడు. "అమ్మాయీ, కుక్కని ఎప్పుడూ వదిలేస్తావేం? పోస్టుజవాన్ని దొడ్డంతా తరిమి పటిలిపెట్టింది. కాస్త కట్టివేస్తూండమ్మా...అదేమిటే అలా వున్నావు?'' అన్నాడు—ఆలోచనలో మునిగివున్న ఆమె ముఖాన్ని చూసి.

"ఏమీలేదు నాన్నా! నేను మామూలుగానే ఉన్నాను." అన్నది సరోజిని.

"జానకిరావు రావడంలేదని బెంగపెట్టుకున్నావా?"

లేదన్నట్లు సరోజిని తలవూపింది.

"ఎవరినేనా పంపమన్నావా తీసుకురావడానికి?" అన్నాడు తండ్రి.

"తప్పు, తప్పు. ఆయన పెళ్ళాలనే వెళ్లేరు." అని కొంచం ఆతురతచూపింది.

"అసలు ఎందుకు వెళ్ళనిచ్చేవు? నాతోటి వెంటనేచెప్పితే నేను అతన్ని ఆపుచేసి ఏదేనా రికమెండ్‌చేసి ఒక ఉద్యోగం ఇప్పించనూ? పాపం, కుర్రాడు చాలా సరదాగా ఉండేవాడు. మళ్ళీ వస్తానన్నాడా?" అంటూ కొంతబాధ్యతను బాధనుచూపించాడు శంకరయ్య.

"ఆ రాకేం, రెండు మూడునెల్లలో వస్తానన్నారు. ఆయనకి మాత్రం అక్కడ ఏంపనుంది? వచ్చేస్తారు." అంటూ అన్నది సరోజిని.

"ఈసారిరాగానే చెప్పమ్మా. నువ్వేం బెంగ పెట్టుకోకు....అలా దిగాలుపడి ఉండకమ్మా." శంకరయ్య కుమార్తెను బుజ్జగించి లోనికివెళ్లేడు.

సరోజిని తనతండ్రి మనోవేదనని గ్రహించింది. ఆయనకి తాను తప్ప యితరులెవ్వరూ లేరు. తన్ను చూసుకునే ఆయన బ్రతుకుతున్నాడు. అటువంటప్పుడు తాను తనగోడవే చూసుకుని దుఃఖిస్తూకూర్చుంటే ఆయన గతి ఏమిటి? ముందుగా పెద్దం క్షేమాన్ని చూడాలి. వారి ఆఖరి రోజులు సుఖంగా గడిచేలాచూడాలి. అందుచేత తాను తండ్రిమనస్సుకు ఏమాత్రం కష్టంలేకుండా ప్రవర్తించాలి. ముందు తన హృదయ విచారాన్ని ఏమాత్రం పైకిచూపగూడదు. తనకు ఏమీ విచారం లేనట్లేఉండాలి. వెంటనే తండ్రిని వెనక్కిపిలిచి "నాన్నగారూ, ఈవేళ మనం సినిమాకి వెడదామండి" అంది. "సరే," అన్నాడు శంకరయ్య. జానకిరావు వెళ్ళిన వారంరోజులనుంచీ ఆమె వేదుకలు మానివేసింది. కాని తండ్రికోరకు వాటిని మానలేకపోయింది.

## 12

జానకిరావు పైడిపాలెం వచ్చేక ఒక క్రొత్తరకమైన ప్రజాజీవితాన్ని చూస్తున్నాడు. పట్టణాలలో పనిఅంతా డబ్బుతో, ఎన్నెన్ని పనులున్నా డబ్బుతో జరిగిపోతాయి. బట్టలు ఆరవేయడానికి కూడా కూలిమనిషి అవసరమే. కాని ఈపల్లెటూరిలో ఎవరిపనులు వారేచేసుకుంటారు. అందులో చిన్నతనం ఏమీలేదు. తాను పట్టణంలో ఉన్నప్పుడు కాగితాలమూటైనా చేత్తోపట్టుకుని వెళ్ళడానికి సిగ్గుపడేవాడు, కాని ఇక్కడి వరస చూస్తే తనపద్ధతి తప్పనితోచింది. ఎవరిపనులు వారు చేసుకోవడమే ఆత్మగౌరవం అని తెలుసుకున్నాడు. దానితో అతని మనస్సు మారిపోయింది. తనకు కావలసినపనులన్నీ తానేచేసుకోవడం మొదలుబెట్టాడు. కాని తానేపనిచేయడం ఎరగడు. అందుచేత గవిరెన్నని అడిగి చాలాపనులు నేర్చుకున్నాడు. పాలుపితకడం మొదలు పశువుకొట్టము శుభ్రంచేసికోవడము వరకూ నేర్చుకున్నాడు. ఆ పనులన్నీ తనకొరకు యితరులు చేయడానికి సిద్ధంగాఉన్నా, తనపనులు తానే చేసుకోవాలనే స్థిరసంకల్పంతో అతడు వాటిని తానే చేస్తున్నాడు. నిత్యవ్యవహారాలన్నీ స్వయంగా చేయడములో అతనికొక నిధమైన నూతనోత్సాహం ప్రబలింది.

ఆ ఊరువచ్చిన పదిరోజులకు ప్రత్యేకంగా ఒకచిన్నపాకవేసుకోవాలనే బుద్ధిపుట్టింది జానకిరావుకు. తన ఇంట్లో ఉండవచ్చని గవిరెన్న యెంత చెప్పినా అతడు ఒప్పుకోలేదు. గవిరెన్న ఇంటి ప్రక్కనే అతని దొడ్డిఉంది. దానిలో జానకిరావు గవిరెన్న సహాయంతో చిన్నపాకవేసుకున్నాడు. గవిరెన్న పశువులలో రెండుగేదెలను తెచ్చి వాటి సంరక్షణ తానేచూస్తున్నాడు. ఇలా సర్వవిధముల తాను ఆ రైతులలో కలిసిపోవడానికి ప్రయత్నించడం మొదలుబెట్టేడు.

నూతిదగ్గరకిపోయి -మట్టిడాగులువడ్డ నాలుగు చొక్కాలు, నాలుగుపంట్లాములు, రెండుపంచలు చేత్తోపట్టుకుని ఎలాగ ఉతకడం అని చూస్తున్నాడు జానకిరావు. ఇదిచూసి గవిరెన్న అతనివద్దకువచ్చి "బాబు, మీరు ఉతుకోక్కడమేమిటండి మాకుర్రోళ్ల ఉతికేస్తారుండండి" అన్నాడు.

"ప్రతిరోజు వాళ్లే ఉతుకుతున్నారు. ఇలా ఎన్నాళ్ళు ఉతికించుకోను? ప్రతిరోజు వాళ్ళు నాబట్టలు ఉతుకుతూంటే సిగ్గువేస్తుంది. ఈవేళమంచి నాబట్టలు నేనే ఉతుక్కుంటాను." అంటూ నవ్వుతూ జానకిరావు సమాధానం యిచ్చాడు.

"బట్టలన్నీ బాడయిపోయేయి. మీరు ఉతుక్కోగలరా మరి?"

"ఆ, దివ్యంగా ఉతుక్కుంటాను."

గవిరెన్న చేదతీసుకుని నీళ్ళుతోడేడు. ఇద్దరూ కలిసి బట్టలు ఉతికి ఆరవేసేరు.

"నాకు బట్టలు చాలడంలేదోయ్. చాలాతక్కువ తెచ్చుకున్నాను." అన్నాడు రావు బట్టలు ఆరవేస్తూ.

"అన్నిఉన్నాయి చాలవండి?"

"ఇవే ఎక్కువగా కనబడుతున్నాయా నీకు? మా ఇంట్లో నాబట్టలు నాలుగుపెట్టెల నిండా ఉన్నాయి. అన్నిబట్టలు తొడగడం అలవాటున్న మూలాన్ని ఏదో చిన్నబోయినట్లుంది. ఇంకో నాలుగుబట్టలు తెచ్చుకోవలసింది." అన్నాడు.

"ఎల్లాగయినా మీబట్టలు ఇక్కడ పనికిరావండి. మీరు కోటు పంటలాముల్తోవస్తే పొలం పని జరుగుతుందాండి?" అన్నాడు గవిరెన్న.

"ఇవి పట్టణాల్లో దాబుసరికి వేసుకోవలసిన బట్టలే. ఇక్కడ ముతకగుడ్డలేకావాలి. నాకు గుడ్డలు అవసరం ఉన్నాయి" అని రావు అన్నాడు.

గవిరెన్న:—"మీకు ఇన్నిగుడ్డలే చాలదంటారు. నాకెన్ని గుడ్డలున్నాయనుకుంటున్నారు?"

"ఓ ఇరవై గుడ్డలు ఉంటాయా?"

"ఇరవై గుడ్డలాండి? నా కుటుంబానికి ఉండదండి ఇరవై. నాకు నాలుగుపంచలు. నాలుగు కండువాలు ఉన్నాయి." అన్నాడు గవిరెన్న నెమ్మదిగా.

"వాటితోటే ఎల్లా గడుపుతావోయ్? మాసిపోయి వాసనకొట్టవూ?"

"చుబ్బరంగా ఉతికెయ్యమండి? నాబట్టలు చూడండి ఎంతబాగున్నాయో?" అంటూ గవిరెన్న మీద వేసుకున్న కండువా యిటూ అటూ చూపేడు.

## 13

తొమ్మిదిగంటలకి గవిరెన్నవచ్చి పొలానికి నీరురావడం లేదనిచెప్పేడు. జానకిరావుకి ఇది ఎందుచేతో తెలియలేదు. "కాలవలో నీరుపారడం లేదా?" అని అడిగేడు.

"మన పొలాన్నిఅంటి కాలవలేదు. పైపొలం నుంచి మనకి నీరు రావాలండి. పైపొలంవాడే నీరియ్యక పేచీపెట్టుతున్నాడు. దొంగవెధవ." అంటూ గవిరెన్న కోపాన్నిచూపాడు.

"ఏమంటాడు?"

"మనపొలంలోకి నీరురానీయడండి. చుట్టుపక్కల పొలాలవాళ్ళందరితోటీ లాలోచీ అయి ముందు వాళ్ళందరికీ నీరుపెట్టేస్తాడు. ఆఖరికి ఎప్పుడో నాకు వస్తుందండి. అప్పుడైనా దెబ్బలాడితేనే" అని తన కష్టాన్ని చెప్పివేశాడు.

"అన్యాయం కాదు అది?" అన్నాడు జానకిరావు.

"కాదండీ మరి! వాడు దుర్మార్గుడండి."

జానకిరావు కర్రతీసుకున్నాడు. "ఆ దుర్మార్గుడెవడు? చెప్పు. బుర్రబ్రద్దలకొట్టి బుద్ధిచెబుతాను. ఇలాంటి నాటకాలు నాదగ్గర పనికిరావు. వాడెవడు?" అంటూ లేచాడు.

"గవరయ్యండి."

జానకిరావు ఆశ్చర్యపోయాడు "గవరయ్యా?"

"అవునండి. ఆడు మాతమ్ముడేనండి."

"నీతమ్ముడే? ఇన్నాళ్ళు చెప్పేవు కాదేం?"

"మేమిద్దరం విడిపోయేమండి. మా యిద్దరికీ మాటలుకూడా తిన్నగా లేవు" అని పాతసంగతి చెప్పాడు.

"నీ తమ్ముడైతేనేం ఇటువంటి పనిచేస్తున్నప్పుడు? నామాటకి ఏమేనా ఎదురుచెప్పేడంటే వానిపని బడతాను. నేనున్నాను నీతరపుని, నీకేం భయంలేదు. రా, రమ్మను మనవాళ్ళందరిని" అంటూ ఉద్రేకం చూపాడు.

"అదిగోనండి, మనవాళ్ళు నలుగురు అప్పైన సిద్ధంగానేఉన్నారు.

"ఈవేళ దెబ్బలాట అయ్యేలాగే ఉందండి." అంటూ గవిరెన్న నెమ్మదిగా—యేదో దూరంలోకి యోచనచేస్తూవున్నట్టుగా అన్నాడు.

"నువ్వూ ఇంకో కఱ్ఱతీసుకురా, వెడుదాం" అని చొక్కా తొడుక్కుని, జోళ్ళుతొడుక్కుని, కఱ్ఱ పట్టుకుని నిలబడ్డాడు జానకిరావు. గవిరెన్న కఱ్ఱ తీసుకుని వచ్చేడు. జానకిరావు ఒకసారి గుండెల మీద చేయివేసుకుని, ఛాతీవిరిచి, గవిరెన్నతోటి ఆ నలుగురు మనుష్యులతోటి పొలంవేపు వెళ్ళేడు.

మందర్భరటకి మళ్ళించగయ్య పదిమందితో కఱ్ఱలు పుచ్చుకుని నిలబడ్డాడు. అంతమందిని చూసేటప్పటికి జానకిరావు గుండెలు ఒక్కక్షణం ఆగి మళ్ళీ కొట్టుకోవడం మొదలెట్టేయి. జానకిరావు ఆగిపోయి.

"గవిరెన్నా! జాగ్రత్తగా ఉండండి. వీళ్ళేం మనవిపట్టుకుని తన్నరుకదా" అన్నాడు. "ఇదేటండీ, భయపడుతున్నారా?" అని ముందుకి వెళ్లేడు గవిరెన్న. జానకిరావు "అబ్బే, ఊరికే జాగ్రత్తగా ఉండమన్నాను, ఎందుకైనా మంచిదని. మీరు నాకు కాస్త ఊతయిచ్చేరంటే చాలు, చూడండి ఎలా నొక్కేస్తానో వాళ్ళనోళ్ళు" అని అందరికంటె ముందు నడవడం మొదలుపెట్టేడు. అందరు పొలం గట్టుదగ్గరికి జేరుకున్నారు.

"గవరయ్యా ఇల్లారా" అని జానకిరావు గవరయ్యను పిలిచాడు. జానకిరావు, గవరయ్య ఒక్కణ్ణేపిలిచేడు. కాని అతడూ ఆ పదిమందితో సహా జానకిరావు దగ్గరికి వచ్చేడు. జానకిరావు ఏంచెప్పుదామా అని ఆలోచిస్తుంటే గవరయ్య మీదికివచ్చి "ఏం, పిలిచేరు?" అన్నాడు. జానకిరావు ఒక అడుగు వెనక్కివేసేడు. "ఎందుకొచ్చిందోయ్, యీదెబ్బలాట? అన్నదమ్ములు ఇలా దెబ్బలాడుకోవచ్చునా మీరు ఒకరికొకరు సహాయం చేసుకోవాలికాని..." అని సలహా చెప్ప మొదలెట్టేడు.

"ఏమన్నారు? ఏమీతెలియక మాట్లాడుతున్నారు. నీరు మాకు కావాలి. ఇస్తేకాని వల్లకాదు, బుర్ర బద్దలకొట్టేస్తాను లేకపోతే అని అన్నాడండి మీరైతే. కావలిస్తే అడగండి" అని పురిమాడు గవరయ్య.

"నేనన్నానా? అబద్ధాల ఎదవా!" అన్నాడు గవిరెన్న.

గవరయ్య మరింత రోషంచూపుతూ, "ఎదవ గిదవ అంటే పళ్ళూడిపోతాయి? జాగ్రత్త" అన్నాడు.

"ఏడిచావులే." అన్నాడు గవిరెన్న.

వాళ్ళిద్దరిమధ్యకి జానకి వచ్చినిలబడ్డాడు. "ఉస్స్స్. ఏమిటిగోల? మీరిద్దరూ ఏమిటీ తిట్టుకోవడం? నేను మధ్యవర్తిగాఉంటాను. మీరు నెమ్మదిగా అన్నిసంగతులు మాట్లాడుకోండి. గాంధీగారు శాంతం భూషణం అనిచెప్పేరు" అన్నాడు.

"పోవయ్యా, శాంతం బోషాణం నువ్వూను. ఎల్లాగయితేనేం వచ్చేవు చేపనయివి" అంటూ గవరయ్య మొరటుగా మాట్లాడాడు.

గవిరెన్న "ఆయన్ని తిట్టేవంటే జాగర్త," అంటూ గవిరెన్న హూంకరించాడు.

"నాయిష్టం వచ్చినట్టు తిడతాను" అన్నాడు గవరయ్య.

ఒక్కొక్క సమయంలో బ్రాహ్మణ్ణి బ్రాహ్మడనడము, కాపుని కాపు అనడంకూడా తిట్టుక్రిందే లెక్క ఔతుంది.

ముఖ్యంగా గవరయ్య తనని బేపనోడని అనడమువల్ల జానకిరావు ఒళ్లు మండిపోయింది. శాంతం గురించి ఉపదేశిస్తున్న జానకిరావే శాంతం వదలివేశాడు.

"ఓరీ చవట్టముండాకొడుకా, నన్ను తిడతావుటా?" అన్నాడు జానకిరావు.

గవరయ్య "తిడతానా, గుండుపగలగొట్టుతానా! అన్నాడు.

"నీబుర్ర చితక్కొట్టుతాను. గాడిదా!" అని జానకిరావు సమాధానం యిచ్చాడు.

"మాటలు సరిగా రానియ్యవోయ్." అన్నాడు గవరయ్య.

"నోరుముయ్!" యిదే రావు సమాధానం.

గవరయ్య "పోయి నీ అబ్బతో చెప్పుకుంటావు" అని కఱ్ఱఎత్తేడు. అది జానకిరావు నెత్తి మీద పడవలసిందేకాని గవిరెన్న వెంటనే తన కఱ్ఱ ఎత్తి గవరయ్యని వెనక్కికొట్టేసేడు. ఇంతలో అందరూ కలబడ్డారు. జానకిరావు నిర్ఘాంతపోయి, వాళ్ళమధ్యనుంచి దూరంగా పారిపోయి దెబ్బలాట చూస్తూ నిలబడ్డాడు.

ఆఖరికి గవరయ్య వగైరాలు అందరూ పారిపోయేరు. ఇద్దరికి దెబ్బలు తగిలేయి. గవిరెన్న పెద్దదెబ్బలు తగలడంచేత స్మృతితప్పి క్రిందపడిపోయేడు. అందరూ అతన్ని తీసుకువచ్చి చెట్టుక్రింద పడుకోబెట్టేరు. జానకిరావు మంచినీళ్లు తెప్పించి ముఖంమీద జల్లి, నోట్లో నీళ్ళుపోసేడు. గవిరెన్నకి తెలివివచ్చింది. ఒకరైతు తువాలు తీసుకుని ముక్కలు క్రింద చింపివేసి అతని గాయాలకి కట్లుకట్టేడు. ఇంతలో చాలామంది చుట్టేశారు. అందరు కలిసి గవిరెన్నని యింటికి తీసుకునివెళ్ళేరు.

ఇంటిదగ్గర గవిరెన్న దెబ్బలుచూసి ఆడవాళ్ళందరు బోరుమన్నారు. జానకిరావు అందరినీ ఊరుకోబెట్టేడు. తాను జాగ్రత్తగా కట్లుకట్టుతూ ఉంటాననీ, తానుండగా గవిరెన్నకేమీ అపాయం లేదనీచెప్పి శాంతపరిచాడు. "ఇతనికేం భయంలేదు. గవిరెన్నా! దెబ్బలు తగిలితే తగిలేయి ఏమీ భయపడకు. బెంగపెట్టుకోకు నేనున్నాను. ఇవన్నీ త్వరగానే మానిపోతాయి. కాని, ఓరి బాబు, ఎంతపనిచేసేడోయ్ గవరయ్య? అన్న ఏమన్నా పడాలి. కాని తమ్ముడైఉండి అన్నగార్ని కొడతాడా! ఎంతతప్పు?" అని గవిరెన్నని ఓదార్చేడు. కాని వెంటనే తనసంగతి జ్ఞాపకం వచ్చింది.

## 14

వెంకటేశ్వరరావు జానకిరావు ప్రాణస్నేహితుడు. అతనికి జానకిరావుకు వచ్చిన కష్టంచూస్తే జాలివేసింది. తాను చెప్పినమాట అతడు విన్నాడు కాదు. కాని జానకిరావు అలాచేయడానికి ప్రధానమైన కారణం పెళ్ళి. తాను ప్రాణప్రదంగా ప్రేమించిన సరోజినిని పెళ్లాడనియ్యనందుకు విరక్తిచెంది వెళ్ళిపోయేడు. అలా వెళ్ళిపోవడంలోనే జానకిరావుయొక్క నిష్కల్మష ప్రేమ కనబడింది వెంకటేశ్వరరావుకి. అతడు జానకిరావు ద్వారా సరోజినినికూడా చాలాసార్లు చూసేడు. ఆమె సుశీల అని గ్రహించేడు. నూతన యుగానికి సం

బంధించినవి కనుక వాళ్ళిద్దరు పెళ్లాడితే బాగుందుననుకున్నాడు. కాని దానివిషయమై యింత గందరగోళం జరుగుతుందనుకోలేదు. వాళ్ళిద్దరు పెళ్ళాడడమే వారికి శ్రేయస్సు. ఆపెళ్ళికి ప్రతిబంధకులైన వారు రామానందం, గంగమ్మ. జానకిరావు ప్రాణస్నేహితుడై ఉండి తాను అతనికి చేయవలసిన సహాయమేమిటా అని ఆలోచించేడు. తనజోక్యము అందులో ఏమాత్రం ఉందో ఆలోచించేడు. తుదకు రెండునెలలవరకు ఆలోచించి, తాను వెళ్ళి రామానందంతోటి, గంగమ్మతోటిచెప్పి ఆపెళ్ళి చేయడానికి ఒప్పించితీరాలని నిశ్చయించుకున్నాడు. కాని తల్లి జబ్బువల్ల అతనికి ఎక్కడికీ కదలడానికి వీలులేకపోయింది. ఆమె జబ్బు తగ్గిన తరువాత కొంతకాలం స్వంతపనులమీద రైలు టిక్కట్టు పుచ్చుకుని తిరగవలసివచ్చింది. తరువాత తనపెళ్ళివిషయమై అటూ యిటూ పదిమారులు తిరుగుతూవుండడము, చివరకు నిశ్చయించుకోవడము జరిగేయి. తనపెళ్ళి నిశ్చయించుకుని ఇంటికి వచ్చిన తరువాత స్నేహితుని పెండ్లివిషయం జ్ఞాపకం వచ్చింది. అప్పటికే నాలుగునెలలు గడిచాయి. కనుక ఇక ఆలస్యం చేయకుండా ఒక శుభముహూర్తం చూసుకుని రామానందం యింటికి బయలుదేరేడు. ఆనాడు రామానందం యింట్లోలేడు. గంగమ్మ అతనివద్ద తనదుఃఖం అంతా వెళ్ళబోసింది. కాని ఆ పెళ్ళికి మాత్రం ఒప్పుకోలేకపోయింది.

తరువాత నాలుగుసార్లు రామానందంగారి యింటికి వెళ్లేడు వెంకటేశ్వరరావు.

ఫలితం లేకపోయింది. ఐనా అతడు తనపట్టు వదలేదు. తుదకు వారిని విసిగించియైనా ఒప్పించాలని నిశ్చయించుకున్నాడు.

మళ్ళీ ఒకసారి గంగమ్మ తనదుఃఖం అంతా వెళ్ళబోసుకుంది.

"వెర్రినాగమ్మ, అంతా తెలివితక్కువేకాని ఏమీ ఎరగడు. వాడు వెళ్ళిపోయేడంటే జాలి వేస్తుంది. తల్లినైఉండికూడా ఏడుస్తూ కూర్చోవడమేకాని యింకేమీ చెయ్యలేకపోయేను. ఎక్కడెక్కడున్నాడో! ఏమేమికష్టాలు పడుతున్నాడో" అంటూ గంగమ్మ కంటతడిబెట్టింది.

జానకిరావు ఎక్కడికివెళ్ళేడో వెంకటేశ్వరరావుకి మాత్రమే తెలుసును. అతడు ఇంతవరకు ఈసంగతి గంగమ్మకు చెప్పలేదు. దీనిని అవసరమైన సమయంలో బాగా సహాయపడేటట్లు ఉపయోగించాలని దాచిఉంచేడు.

"వాడికేమండి ఏదో పొలంలో సుఖంగా వ్యవసాయం చేస్తున్నాడు. వాడక్కడే సుఖంగా వుంటాడు. వాడిని అలాగే ఉండనియ్యండి ఏం భయంలేదు." అంటూ వెంకటేశ్వర్రావు అన్నాడు.

"ఏమోనమ్మా, మీకేం చెప్పుతారు! నామనసు ఎంత కుమిలిపోతుందో మీకేం తెలుసు! ఈపెద్దవాడికి ఒళ్ళుతెలియదు; తిట్టడం తప్ప. పోనీ వాడికి ఏ నియోగిపిల్లో ఆపిల్లనే ఇచ్చి పెళ్ళెందుకు చేయకూడదు? నాకర్మం కాకపోతే ఇంట్లోంచే పొమ్మనాలా తిండిలేకుండా?'' అన్నది.

గంగమ్మ ఈమాట అనేటప్పటికి వెంకటేశ్వరరావుకి ఆశ కొస దొరికినట్లయింది. ''మీరేమీ విచారించకండి. ఏదో అలా వస్తూంటాయి కష్టాలు. వాటిని తొలగించుకోవడం మనచేతిలోనేఉంటుంది" అన్నాడు.

''నువ్వు ఇంట్లో వాడిలా చనువయిపోయేవు కనుక అడుగుతున్నాను. ఆపిల్లని వాడు పెళ్ళిచేసుకుంటానంటాడు అది మంచిదేనా చెప్పమ్మా'' అని గంగమ్మ నెమ్మదిగా అడిగింది.

"మీకు ఎలాఉంది చెప్పండి!'' అన్నాడు వెంకటేశ్వర్రావు.

"వాళ్ళది నియోగిశాఖ అనే నా ఆటంకం. అంతే. అంతగాకాదు కూడదు అంటే నేనేం చేస్తానమ్మా? నాకొడుకు నాకుండేచాలు.'' అనివేసింది ఆతల్లి.

ఆమె మాటలతో అతని హృదయం కరిగిపోయింది. తల్లి హృదయం కొడుకుకోసం ఎంత ఆరాటపడుతుందో తనతల్లి జబ్బులో తాను కనిపెట్టేడు. గంగమ్మ మాతృప్రేమని కనిపెట్టేడు. ప్రేమ ఒకవిధమైన మనోదౌర్బల్యం అని కొందరు చెప్పుతూంటారు. మాతృప్రేమ గంగమ్మ పట్టును సడలించిన మాట నిజమే. కాని అది మనోదౌర్బల్యం అయినా కాకపోయినా పవిత్రమైనది, ఉన్నతమైనది అని కనుగొన్నాడు వెంకటేశ్వరరావు. ఆమెకు నచ్చచెప్పడం మొదలెట్టేడు.

"ఇప్పటిరోజుల స్థితినిబట్టి చూస్తే ఆపిల్ల నియోగియైనా జానకిరావు పెళ్ళిచేసుకోవడంలో అభ్యంతరం లేదనే నేనంటాను. ఒకవర్ణంలో వాళ్ల ఇంకొక వర్ణంలో వాళ్ళని పెళ్లాడుతున్నారనుకోండి. కాని ఇది శాఖాభేదమే కనుక అంత ఇబ్బందిలేదు. ఈ రోజుల్లో మనం ఇటువంటివి ఏమీ పట్టింపు చేసుకోకూడదండి. ఆపిల్ల మంచిదవునా కాదా, చదువుకుందా లేదా, వాళ్ళు శుభ్రమైన వాళ్ళవునాకాదా, ఇటువంటివే మనం చూసుకోవలసినవి. సరోజిని చాలా మంచిది."

"అలాగనే నేనూ విన్నానమ్మా. కాని ఏం చెయ్యను!" అని చేతులు నిరాశతో ముడిచింది.

"వాళ్ళిద్దరు పెళ్ళిచేసుకోవాలనే అనుకున్నారు. కాని సరోజిని ఏమందో తెలుసునా మీకు? జానకిని ఇల్లువదలిపెట్టి పోవద్దన్నది. ఈ పెళ్ళిచేయడానికి మీకు ఇష్టంలేకపోతే, జానకిరావుని మీయిష్టం వచ్చిన పిల్లనే పెళ్లాడమంది. తాను పెళ్ళిచేసుకోకుండా అలాగే ఉండిపోతానంది'' అంటూ సరోజిని సుగుణాన్ని వెల్లడించే సంభాషణని ఆమె చెవుల వేసింది.

"అలాగా. గుడ్డి పెద్దమ్మని, ఇంట్లో కూర్చుంటాను. నాకేం తె[illegible] ఆపిల్లని ఎప్పుడేనా చూడవచ్చా, [illegible]?" అంటూ ఆముసలి హృదయం ఆనజాపింది.

''చూడకేమండి. ఆపిల్ల ప్రతిరోజూ కాలేజీకి వెడుతూనే ఉంటుంది. ఒకనాడు యిక్కడికే తీసుకువస్తానుండండి.'' అన్నాడు వెంకటేశ్వర్రావు.

"ఇక్కడికి వద్దమ్మా. మా పెద్దాడు ఒళ్లుతెలియక తిడతాడేమో చిన్నపిల్ల భయపడిపోతుంది. ఎప్పుడో నిన్ను తీసుకుని నేనే వాళ్ళయింటికి వెడతాను. అయితే, తెలియక అడుగుతాను—కాలేజీలో చదువుతే ఆడపిల్లలు చెడిపోతారంటారు కాదమ్మా?" అని తన భయాన్ని బయటబెట్టింది గంగమ్మ.

"సరే అనుకుందాం కాని అందరు పిల్లలు అలా ఉంటారాండి? నూటికి ఒక పిల్లయేనా మంచిది ఉండదంటారా? సరోజినిని గురించి నేను బాగా ఎరుగుదును చాలా యోగ్యురాలు. అటువంటి కోడలిని మీరింక ఎక్కడా సంపాదించలేరు. ఒక సంగతి చెప్పుతున్నాను; జానకీరావు క్షేమం కోరినవారయితే మీరు వాళ్ళిద్దరి పెళ్ళికి తప్పకుండా ఒప్పుకోవాలి. మీరు ఒప్పుకుంటారాలేదా?''అంటూ ఆమె ముఖంలోకి చూచాడు.

"నాకొడుకు నాకొస్తే చాలు బాబు. కాని వాడెక్కడున్నాడో ఏంతెలుస్తుంది'' అని హృదయారాటం చూపింది.

Sealammapeta Rajhmundry



''వాడెక్కడికి వెళ్లేడో తెలిసికోకుండా కూర్చు న్నాననుకున్నారా? మీరు ఈ పెళ్ళికి ఒప్పుకునే వరకు నేను వాడెక్కడ ఉన్నాడో మీకు చెప్పను" అన్నాడు వెంకటేశ్వర్రావు.

జానకిరావు ఎక్కడ ఉన్నాడో తెలుసుననేటప్పటికి ఎక్కడున్నాడో తెలుసుకోవాలనే ఆతురత ఎక్కువైపోయింది గంగమ్మకి.

''నీకు తెలుసునా నాయనా? చెప్పవు, చెప్పవూ, ఎక్కడున్నాడో? వాడిని చూడాలని నాకళ్లు కాయలు కాసిపోయి ఉన్నాయి నాయనా" కళ్ల యింతవేసి చేసికొంటూ అడిగింది.

"మీరు ఏమీతొందర పడకూడదండి. మీరు అక్కడికి వెడితే జానకిరావుకి కోపంవచ్చి అసలు మనకెవ్వరికీ తెలియకుండా ఉండేలాగున ఎక్కడికేనా పారిపోతాడేమో! వాడక్కడ ఎలా ఉన్నాడో నేను వెళ్ళి ఒక్కసారి చూసివస్తాను. మీరు మాత్రం నేను చెప్పేవరకు ఏమీ చేయకండి" అంటూ వెంక అంటూ మళ్ళించ్చాన పరచాడు.

"పోనీలే మానాయన ఎక్కడున్నాడో చెప్పు" అన్నది.

"సైదిపాలెంలో మీపొలం ఉంది కాదూ, అందులో వ్యవసాయం చేస్తున్నాడు. మీరైతు గవయ్య వాడికేమీకష్టం కలగకుండా చూస్తున్నాడు" అని చెప్పివేశాడు వెంకటేశ్వర్రావు.

''అలాగా నాయనా! అక్కడికి వెడుతున్నావనేనా చెప్పేడుకాదు. ఒకసారి వెళ్లేనా చూద్దును. అక్కడేమేమి కష్టపడుతున్నాడో!" అన్నది తల్లి.

"లేదండి. మొన్ననే నాకు కబురు వచ్చింది. మొన్న అక్కడినుంచి ఒకమనిషి వస్తే అన్నీ కనుకున్నాను."

"ఎలాగున్నాడమ్మా?"

"నిక్షేపంలా ఉన్నాడు. వాడికేమండీ!"

"నీవలా అంటావు వాడిని చూడాలని నేనెంత కుళ్ళిపోతున్నానో మీకేం తెలుసు?" అన్నది గంగమ్మ.

"వాడిని చూడాలనే కనుక మీకు ఉంటే ఈ పెళ్ళికి ఒప్పుకోవాలి. ఈపెళ్లి జరిగితేనేకాని వాడు మీకు కనబడడు. ఇప్పటికేనా మీరు ఒప్పుకుంటారా?" అని అన్నాడు వెంకటేశ్వరావు.

"ఇప్పటికీ ఒప్పుకోకపోవాలి? నాకొడుకు నాకు కనబడితే ఇంకా ఏం ఒప్పుకొమ్మన్నా నేను ఒప్పుకుంటాను. మరి నా పెద్దకొడుకుమాటో?'' అని నిరాశతో కళ్లయింత చేసింది.

"మీరు ఒప్పుకుంటే ఆయన మనస్సు మార్చే పూచీ నాది."

"అయితే నేనేమీ అడ్డుచెప్పను. అంతా నీదే భారం చూడమ్మా! నాయనకి ఒక ఉత్తరమేనా వ్రాసి పెట్టుదూ పెద్దాడిని వ్రాయమంటే నన్ను పట్టుకుని తిడతాడు కాని వ్రాయడు'' అన్నది గంగమ్మ.

"అలాగే. నేనొక ఉత్తరం వ్రాస్తున్నాను. దానితో మీఉత్తరంకూడా పంపిస్తాను.''

అని ఉత్తరం వ్రాసుకుని తన ప్రయత్నం కొంతవరకు సఫలమయింది కదా అనే ఉత్సాహంతో వెంకటేశ్వర్రావు యింటికి బయలుదేరాడు.

# 15

ఆ ఉత్సాహంతో ఆరోజంతా తన స్నేహితుని విషయమై కర్చుపెట్టాలని నిశ్చయించుకున్నాడు వెంకటేశ్వరరావు. అతడు గంగమ్మ, సరోజిని, రామానందముల హృదయాలను కనిపెట్టి వారిని జానకిరావు పరిస్థితికి అనుకూలంగా మార్చడానికి పూనుకున్నాడు. గంగమ్మ మనోస్థితిని కని పెట్టేడు. మాతృప్రేమ ఎప్పుడూ వెన్నవంటిదే. దానికి కత్తికోతలేదు, రాతిదెబ్బతగలదు, దుఃఖవారాబ్ధిలోకూడా పైకితేలి అలరారుతూనే ఉంటుంది. సరోజినివైపు గంగమ్మ మనస్సు త్రిప్పడానికి ప్రయత్నించి ఆతడు సఫలత చెందేడు. ఇంక యీ పెళ్లికి ఆమె ఆటంకం ఏమీలేదు. యిక రామానందంతో మాట్లాడాలి కాని అతనితో మాట్లాడేముందు సరోజిని మనస్సు యేవిధంగా వుందో ఒక్కసారి చూడడం మంచిదనుకున్నాడు. అంచేత తిన్నగా సూర్యభవనానికి త్రోవతీశాడు.

ఎందుకోగాని సరోజిని మేడమీద వీధివైపు వసారాలోకి వచ్చింది. క్రింద, మేడముందు వెంకటేశ్వరరావు అటూఇటూ పచారుచేస్తూ కనబడ్డాడు. అతడెందుకు వచ్చేడో, ఎందుకు అలా పచారు చేస్తున్నాడో తెలిసిందికాదు. సరోజిని మేడమీద కనబడగానే వెంకటేశ్వరరావు ప్రాణాలు లేచి వచ్చేయి. ఒక్క వెర్రినవ్వునవ్వేడు.

"ఏమండి వచ్చేరు?'' అన్నది అక్కడనుండే సరోజిని

"మాట్లాడాలి."

"మేడమీదకిరండి" అంటూ అన్నది.

''గుమ్మంలో కుక్క ఉంది."

"ఫరవాలేదు కట్టేసిఉంది.''

''లేదు. విప్పివేసి ఉంది"

జానకిరావు స్నేహితుడవడంచేత కాబోలు ఆకుక్క వెంకటేశ్వరరావు మీదకూడా శత్రుత్వం వహించింది. అది ఇదివరకు ఒకసారి అనుభవించిన వాడవడంచేత యిప్పుడు ముందుజాగ్రత్త తీసుకున్నాడు. సరోజిని క్రిందకి వెళ్ళి అతనిని క్షేమంగా పైకి తీసుకువచ్చింది. వెంకటేశ్వరరావుకి మొదట విషయం ఎలాప్రారంభించాలో తెలిసిందికాదు. ఇద్దరు ఒకరినొకరు యెరుగుదురుకాని ఎక్కువ చనువులేదు. అందుచేత ఏమంటే ఏంతప్పో అని వెర్రిచూపు చూస్తూ కూర్చున్నాడు. ఆమె మనోస్థితిని అవగాహన చేసుకోవాలనుకున్నాడు కాని ఏమీ శక్యమైందికాదు. అతడు జానకిరావు స్నేహితుడని తెలిసినా ఎందుకు వచ్చేడో ఊహించుకోలేక పోయింది సరోజిని. అతడు మాట్లాడడానికి జంకడంచూసి మొదట ఏమో అనుమానపడ్డది.

"ఇంత ఎండలో వచ్చేరెందుచేత?" అంటూ చివరకు సరోజినియే సంభాషణ ప్రారంభించింది.

"ఊరికేనే ఒకసారి క్షేమ సమాచారాలు కనుక్కుని పోవడానికి వచ్చేను" అన్నాడు.

''అంత క్షేమసమాచారాలు కనుక్కోవడానికి మనకి అంత ఎక్కువ పరిచయమేమీలేదే?" అంటూ మేడ పైభాగం వేపు చూచింది.

"జానకిరావు ద్వారా ఉంది కాదా?'' అన్నాడు వెంకటేశ్వర్రావు.

"ఇప్పుడాయన ఇక్కడలేరే''

"అందుచేతనే నేను ఇప్పుడు ఇక్కడికి రావలని వచ్చింది. నేను వాడి శ్రేయస్సు, మీశ్రేయస్సు కోరి ఇక్కడికి వచ్చేను.''

సరోజిని ముఖంలో మార్పుకలిగింది. కాని ఆమెకు యింకొక అనుమానం; జానకిరావుకి తనకి ప్రేమ ఉండడంచేతనే జానకిరావు వెళ్ళిపోవలని వచ్చిందని, అతనిపై తన ఆశను వదలుకొమ్మని చెప్పడానికి వచ్చేడేమో అని సందేహించి ఆమె ఏమీ జవాబు చెప్పలేదు.

''ఇంటినుంచి వెళ్ళిపోయినప్పుడు, మీయింటికి వచ్చి ఆ తరువాత మాయింటికి వచ్చేడు వాడు" అన్నాడు వెంకటేశ్వరావు.

సరోజిని అతనివైపు చూసింది.

"ఏ సంభాషణ అంతా నాతో చెప్పేరు." సరోజిని అతనిని కన్నురెప్ప వేయకుండా చూస్తూ వుంది.

"నేను ఇక్కడ అట్టేసేపు ఉండదలచుకోలేదు కనుక వచ్చినపని త్వరలో చెప్పివేస్తాను" అంటూ వెంకటేశ్వరావు ఉపక్రమించాడు. నేను మిమ్మల్ని కొన్ని సంగతులు, మీ శ్రేయస్సు నిమిత్తమై, అడుగుతాను. చెప్పుతారా?"

"అడగండి."

"మీరు జానకిరావు పెళ్లాడుకోవాలని అనుకున్నారు. గంగమ్మగారు, రామానందగార్ల, ప్రతిబంధకాలవల్ల అది జరిగిందికాదు. జానకిరావు ఎక్కడికో వెళ్ళిపోయేడు. అప్పుడే నాలుగు నెల్లయింది. ఇదంతా మీరు భరించలేకుండా వున్నారనుకుంటున్నాను." ఆ తరువాత కొంత ఆగాడు. అతను యోచిస్తున్నాడు. ఇప్పుడూ జానకిరావుని పెళ్ళాడడం ఇష్టం ఉందాలేదా అని మాత్రం అడగలేకపోయేడు. ఆందువిషయమై విముఖతలేనట్లు తెలిస్తే చాలుననుకున్నాడు.

"మీ పెళ్ళివిషయమై గంగమ్మగారు ఒప్పుకుంటారో లేదో మీకు ఏమేనా తెలుసునా?" అని సంభాషణ సాగించాడు.

"ఒప్పుకోరనే అనుకుంటున్నాను."

"రామానందంగారో?"

"ఆయనకూడా."

"పోనీ, వారిమనస్సు ఏవిధంగాఉందో కనుక్కోవడానికి నువ్వు ప్రయత్నించేవా?"

"ప్రయత్నించినాయన వెళ్ళిపోయేడుకాదా ఆయనకంటే ఎక్కువ నేనేం ప్రయత్నించగలను? అని తలవంచుకున్నది.

"అయితే ఇంతేనా? ఏమీ చేయకుండా ఊరుకుకోవడమేనా?"

"భగవంతుడిదే భారం అంతా."

"నిజమే, భగవంతునే నమ్మేరు కనుక భగవంతుడు మీకొక శుభవార్త పంపించేడు. మీపెళ్ళికి గంగమ్మగారు ఒప్పుకున్నారు." అంటూ నవ్వు ముఖంతో అన్నాడు వెంకటేశ్వరావు.

సరోజిని అది నిజమో అబద్ధమో తెలియక ఆశ్చర్యంతో చూసింది.

"ఇది నిజమే. ఇప్పుడు నేను అక్కడినుంచే వస్తున్నాను. తనకొడుకు బాగుకోరి ఒప్పుకుంది గంగమ్మగారు. రామానందంగారు మిగిలేరు. ఆయన మనస్సు మార్చే పూచీ నాది. ఆయన ఇంటివద్దలేడు. ఇప్పుడు మళ్ళీవెళ్ళి మీపెళ్ళికి ఒప్పుకునే వరకు ఆయన్ని వదలిపెట్టను." అన్నాడు.

"ఏమో!" అంటూ చూచింది.

"ఏమో ఏమిటి? చూద్దురుగాని"

సరోజిని వెంకటేశ్వరరావు ప్రయత్నం ఏమాత్రం సఫలమౌతుందా అనే ఆలోచనలో పడింది.

"జానకిరావు ఎక్కడఉన్నాడో తెలుసునా మీకు?"

"తెలియదు. అదే మిమ్మల్ని అడుగుదామనుకుంటున్నాను." అన్నది పైకివస్తున్న ఉద్వేగాన్ని అణచుకొంటూ.

"వాడు క్షేమంగానే ఉన్నాడు."

ఆతురతతో "ఉత్తరం వచ్చిందా?" అంటూ అడిగింది.

"ఒకమనిషిద్వారా తెలుసుకున్నాను. వాడిప్పుడు పైడిపాలెం అనే పల్లెటూరిలో ఉన్నాడు. అక్కడ వాళ్ళపొలంఉంది. వేద్యంచేస్తున్నాడు."

"ఆ ఊరెంతదూరం ఉంటుంది ఇక్కడికి?"

"ఏభై మైళ్ళు పైగా ఉంటుంది ఇక్కడికి"

"పాపం, ఆయనేం బాధపడుతున్నారో అక్కడ?" ఆమెముఖంలో విచారరేఖలు మరింత ప్రస్ఫుటమైనవి.

"మీకేం బెంగవద్దు వాడక్కడ ఏచీకుచింత లేకుండా అతికులాసాగా ఉన్నాడుట."

"అయితే నాకొక్క ఉపకారంచేసి పెడతారా?" అంటూ అనుమానంతో అడిగి ఆవేదనతో అతనిముఖంలోకి చూచింది.

"ఆయనకి ఒక ఉత్తరం వ్రాద్దామనుకుంటున్నాను. ఆయన ఇన్నాళ్ళనుండి ఒక్క ఉత్తరమేనా వ్రాసేరుకారు. ఆయన ఎడ్రసుచెప్పుతారా?"

"ఆ నేనుకూడా ఒక ఉత్తరం వ్రాస్తున్నాను. అదీ ఇదీ కలిపి పంపించివేద్దాం."

అని జేబులోఉన్న ఎడ్రసు కాగితం ఆమెకిచ్చి "నేను మళ్ళీ సాయంత్రం కనబడతాను" అని వెళ్ళిపోయేడు.

ఇంతవరకు విన్నసంగతులనుబట్టి సంతోషించాలో విచారించాలో పూర్తిగా తెలియక ఒకసారి సంతోషం, ఒకసారి విచారం అనుభవిస్తూ కాగితం కలం తీసుకుంది సరోజిని.

# 16

"ఏమండీ, జానకిరావు కనబడడంలేదే?" అంటూ ఒక విద్యార్థి రామానందానికి నమస్కారం చేస్తూ అడిగాడు.

"అప్పటినుంచి ఊళ్ళోలేడు." అంటూ రామానందం సమాధానం యిచ్చాడు.

"నాలుగైదునెల్లనుంచీ అలాగే అంటున్నారు. సెప్టెంబరు పరీక్షకి వస్తానన్నాడు రానేలేదేమిటండీ?"

"వాడికి పరీక్షకి కట్టాలనిలేదుట."

"ఈభాన్స్ అనవసరంగా పోయింది కాదండీ? వాడుఉంటే తప్పకుండా ప్యాసయేవాడు. ఎందుచేతనంటే మేం ఇద్దరం కలిసి చదువుతూఉండేవాళ్ళం. ఇద్దరి పరీక్షపోయింది. ఇప్పుడు నేను ప్యాసయేను, సెకండుక్లాసు కూడావచ్చింది. వాడుంటే ఫస్టుక్లాసే వచ్చేదేమో మాకు. వాడు నాతో చెప్పకుం[illegible]దేమని చూస్తున్నాను...పోనీ వాడెక్కడున్నాడో చెప్పుతారా?" అంటూ ఆ విద్యార్థి వాకబుచేశాడు.

రామానందానికి ఏం చెప్పడానికి తోచక అటు ఇటు కంగారుతో చూస్తూ "ఏం?" అన్నాడు.

ప్రక్కనున్న విద్యార్థి "ఒక ఉత్తరం వ్రాయాలని" అన్నాడు.

"వాడి ఎడ్రసు మరిచిపోయేను. తరువాత కనబడు. నాకు పనిఉంది, పోవాలి."

అని వెంటనే లోపలికి వచ్చి వీధితలుపు వేసేడు. ఆ ఇద్దరు విద్యార్థులు ఇతని ప్రవర్తన చూసి తెల్లబోయి, ముఖాలు చూసుకుని వెళ్ళిపోయేరు.

జానకిరావు తనతోడి విద్యార్థులతో అతిచనువుగా మసలుతూ ఉండేవాడు. అందుచేత అతని కొరకు నిత్యము ఎవరో ఒకరు వస్తూనేఉండేవారు. జానకిరావు వెళ్ళిపోయిన తరువాత ఆ ఆగంతకులకి సమాధానం చెప్పవలసిన బాధ్యత రామానందం మీదపడ్డది. ఇది బాధ్యతకన్న బాధగానే కనబడింది. జానకిరావుమీద ఉండేకోపంతో మొదట ఆ వచ్చిన వాళ్ళందరినీ తిట్టిపొమ్మనేవాడు, కాని యింట్లో, వీధిలో, సంతలో, రైలులో, ఎక్కడచూసినా అందరూ జానకిరావునిగూర్చి

ప్రశ్నించేవాళ్ళే. ఒక మనుష్యుడు కనబడకపోయి నప్పుడే ఆతని ప్రాముఖ్యత తెలుస్తుందంటారు. దీనిని రామానందం బాగా అనుభవించేడు ఈ ప్రశ్నలమూలాన్ని. మనిషి కనబడకపోతే ప్రాముఖ్యతమాట ఎలాఉన్నా ప్రశ్నలు మాత్రం ఎక్కువై పోతాయనుకున్నాడు. ఏమనిషైనా కనబడకపోతే అడ్డమైనవాడల్లా వచ్చి ఫలానీవాడేమయ్యేడని అడుగుతాడు. నిజంగా ఆమనిషే వాడికి కనబడితే వాడికి ఆమనిషితో ఏమీపనిఉండదు. పలుకరించేపాటి పరిచయమేనా వాళ్ళిద్దరికీ ఉండదు.

జానకీరావును గురించిన కుశల ప్రశ్నలు ఎక్కువైనకొద్దీ రామానందానికి విసుపు, కోపం యినుమడించేయి. చాలా ప్రశ్నలకి సమాధానం చెప్పేవాడేకాదు. కాస్తలోకువగా కనబడ్డవాడినల్లా మళ్ళీ నోరెత్తకుండా చీవాట్లు పెట్టేవాడు. కాస్త పెద్దమనుష్యులు అడిగితే కష్టైవిరిచి పొయ్యిలో పెట్టినట్లు చెప్పి వూరుకునేవాడు. కాని పగలూ, రాత్రీ ఎల్లప్పుడు ... మళ్ళించ్లో 'జానకీరావు' అనేమాట ప్రతిధ్వనిస్తూనే ఉండేది. అది అంతరాత్మలోంచి వచ్చినది. దానిని నోరుమాత్రం అతడు కట్టివేయలేక పోయేడు. కట్టివేయలేదు. ఎవనికైనా ఈ అంతరాత్మని అరికట్టగల శక్తి ఉన్నట్లయితే, ఆ క్షణంనుండి ఈ ప్రపంచం అల్లకల్లోలమయి పోకుండా ఉండదు. ప్రపంచాన్ని కట్టుబాటులో ఉంచేది అంతరాత్మ.

దీని ప్రభావంవల్లనే రానురాను రామానందం మనస్సు మారజొచ్చింది. మొదట ఉన్నంత కోపం తగ్గిపోయింది. జానకిరావు మీదకూడా ద్వేషభావం చాలవరకు తగ్గిపోయింది. కాని 'అతడెక్కడ ఉన్నాడు' అనే ప్రశ్నమాత్రం రామానందం హృదయాన్ని కలచివేయ నారంభించింది. మొదట జానకీరావు ఎక్కడికిపోయినా సరే అని ఊరుకున్నాడు. కాని ఈ నిరంతర ప్రశ్నల మూలంగా అతనికికూడా జానకీరావు ఎక్కడున్నాడో తెలిసికొనవలెనన్న బుద్ధిపుట్టింది. సాధారణంగా మనకు ఎక్కువకోరిక ఉంటేనే కాని భగవంతుడు ఏవిషయాన్ని తెలుపడు, దేనిని ప్రసాదించడు. కనుకనే రామానందానికి జానకీరావు ఎక్కడఉన్నాడో తెలుసుకోవాలనే ఆతురతతో ఇంట్లో ప్రవేశించినవెంటనే గంగమ్మ జానకీరావు పైడిపాలెంలో ఉన్నాడన్న సంగతి చెవిని పడవేసింది. అతడేమీ గంగమ్మతో చెప్పలేదు కాని అతని అంతరాత్మ అతనితో ఏమేమో చెప్పడం మొదలెట్టింది. అది వినడానికని నిశ్శబ్దంగా పోయి తనగదిలో పడక కుర్చీమీద వ్రాలాడు....రెండేళ్ళనుంచి ప్రతిఘటిస్తున్న తాను యీనాడు చటుక్కున సరోజినీ జానకిరావుల పెళ్ళికి ఒప్పుకోవడమా!!

మెల్లగా వెంకటేశ్వరరావు గదిలో ప్రవేశించేడు. రామానందం అతనినిచూసి ఉలిక్కిపడ్డాడు "రా, కూర్చో. ఏం యిలావచ్చేవు?" అన్నాడు.

''ఈమధ్య జానకీరావు కనబడడంలేదండి. అంచేత ఒక్కసారి చూసిపోదామని వచ్చేను" అంటూ సవినయంగా అన్నాడు.

"ఎందుకు?"

"ఏముందండీ? ఊరికనే"

"ఊరకనే అయితే-లేదు." అన్నాడు రామానందం.

"లేకపోతే ఎల్లాగండీ?"

''అంటే?"

"మీ ఇంట్లోంచి వాడు వెళ్ళిపోవడమేమిటండీ?" అంటూ వెంకటేశ్వర్రావు అన్నాడు.

"ఏమిటా? వెంకిఫటాలయితే, పెద్దవాళ్ళు చెప్పినమాట వినకపోతే ఆదేగతి'' అన్నాడు రామానందం.

"అమాత్రం తెలిసిందండి. కాని అది అన్యాయమని మీకు తోచలేదూ?'' అంటూ వెంకటేశ్వరరావు తిరుగా ప్రశ్నించాడు.

"అన్యాయమా? నన్ను వెక్కిరించడానికా వచ్చేవు?"

"రామానందంగారు! నన్నే అపార్థం చేసుకుంటున్నారా?''

"కాదోయ్. మీ స్నేహితుడని నువ్వు వాడిని వెనకవేసుకుని వస్తున్నావేమో, వాడు నీకన్నా నాకుదగ్గర. వాడు నాతమ్ముడు!"

"ఆత్మసాక్షిగా మీరు అన్నారాండి?''

"తప్పకుండా! నేను ఎప్పటికైనా వాడికి అన్యాయం చేస్తానా? నేనేమీ ఆసలు కలుగజేసుకోను. కాని వాడు దూబరకర్చుమొదలెట్టేడు. రెండోది. అదిగో ఆ నియోగిపిల్ల ఉంది మాసంసారం చెడపడానికి?'' అంటూ తన ఆటంకాలు రెండూ చెప్పివేశాడు.

"కాని మీరు తొందరపడకండి. మీ తమ్ముడు నాకన్న మీకే దగ్గరవాడు. అయినప్పటికీ, ఇప్పుడు పెళ్ళిలో పురోహితుడిలా నేను మీ ఇద్దరికీ దగ్గరే. అంచేత కొంచెం నామాటవినాలి మీరు. జానకీరావు బాధ్యతలేకుండా ప్రవర్తించేవాడు. కాని తప్పుచేసినప్పుడల్లా తనతప్పు ఒప్పుకునేవాడు కాదా?"

"కాని నేను ఎంతతిట్టినా మళ్ళీ ఆతప్పే చేస్తూ ఉండేవాడు."

"అంటే, మీరు చెప్పేమాటల్లో ఏదో దోషం ఉండక మానదన్నమాట! లేకపోతే వాడు వెంటనే త్రోవలోకి వచ్చును. ఆదోషం ఏమంటే, మీరు ఒక్కవిసరుకోపం చూపిస్తారు.''

రామానందం అంగీకరించాడు.

"అవును, ఏంచెయ్యను? అదైనా వాడితప్పు లేందే నేనేమీ కోప్పడను.''

"మీరు అలా అంటారు. కాని కోపిష్ఠులైన వారికి తిట్టడానికి కారణం అక్కర్లేదు. అయినా తప్పుచేసినవాడిని వెంటనేతిట్టి భయపెట్టితే వాడు భయపడుతాడు కాని తనతప్పు సర్దుకోలేడు. వాడికి తనతప్పుతెలుసుకుని, అది దిద్దుకునేలాగున మంచిగా చెప్పాలి. తప్పుచేసినవాడికి ఆతప్పు ఒప్పుకునేలాగున అవకాశం ఇవ్వాలి. తరువాత వాడి మనస్సు నొప్పిపెట్టకుండా సలహా యివ్వాలి. కాని వాడిమీద విసుక్కుని తిట్టినంతమాత్రంలో లాభం లేదు. జానకీరావు నాదగ్గరికివచ్చి అన్నీచెప్పుతూండేవాడు. కాని వాడి నిర్లక్ష్యప్రవర్తన, దూబరకర్చుమాత్రం పోలేదని నేనెరుగుదును.''

"అంచేతనే నాఒళ్లు మండిపోయింది."

"క్షమించాలి మీరు వాణ్ణి యింట్లోంచి పొమ్మనడి అందుకనికాదు. సరోజిని విషయమై."

"ఆ సంబంధం నాకు ఇష్టం లేకపోయింది."

---

వచ్చేసంచికలో మరికొన్ని ఘట్టాలు.